# ప్రేమ : పెండ్లి

పి. ప్రేమచంద్ర

గడియారం రెండు కొట్టింది.

బేబీకి మందు ఇవ్వవలసిన టైం అయిందని అరుణ కుర్చీలో నుండి లేచి మంచం వద్దకు వచ్చింది. ప్రక్కనే బల్లమీద ఉన్న సీసా తీసి ఔన్సు గ్లాసులో మందుపోస్తూ,

"తల్లీ! లే అమ్మా! మందు తాగుదువుగాని!" అంది.

"పో! నేను తాగను రోజూ మందులే నేంటి? నాకు వద్దు" అని – మళ్లీ బ్రతిమలాడే ధోరణిలో, "అమ్మా! నాన్న ఎక్కడికెళ్లాడమ్మా! నాకు జ్వరం వచ్చినా రాలేదేం, రమ్మనవా?" అంటుంటే ఆ మాతృ హృదయం కరిగి కండ్ల వెంబడి నీళ్లు కారనారంభించాయి. కాని అవి బేబీ చూడకుండా ఉండాలని ప్రక్కగా తిరిగి పైట చెంగుతో కండ్లు ఒత్తుకుంది.

"వస్తారమ్మా. మరి నువ్వు మందు తాగితే నాన్న తప్పక వస్తారు. త్రాగమ్మా. మా బేబీ చాలా మంచిది. మందు తాగుతుంది" అంటూ ఎన్ని విధాల బుజ్జగించినా, ససేమిరా త్రాగనంది. 'నాకు నాన్నే కావాలి' అని మారాం చేయసాగింది. అలా ఏడుస్తూనే కాస్సేపటికి నిద్రపోయింది. నిద్రపోతున్న ఆ అమాయక ముఖం చూచేసరికి ఆమె హృదయం తరుక్కుపోయింది. పాలిపోయిన ఆ బుగ్గలపై కన్నీటి చారలను నెమ్మదిగా తుడిచి బయట వరండాలోకి వచ్చి, అక్కడేఉన్న ఈజీచెయిర్‌లో కూలబడింది అరుణ.

కథానిక

"నేనేం చెయ్యగలను! డాక్టర్ బిడ్డను చూచి టైఫాయిడ్ అన్నాడు. ఆస్పత్రిలో చేరుద్దామంటే ఇంటిదగ్గర చూచుకొనే దిక్కెవరు? గోపిగాణ్ణి ఎవరు చూచుకుంటారు?" అని అనుకుంటుండగానే మూడేళ్ల గోపీ గునగున నడచుకుంటూ తల్లి దగ్గరకు వచ్చాడు.

"అమ్మా! అక్క ఎందుకు రోజూ బజ్జుంటుంది. నాతో ఆటకు రమ్మనవే!" అంటూ తల్లి ఒళ్ళో కూర్చుని ఆమె మెళ్ళో ఉన్న గొలుసుతో ఆట ప్రారంభించాడు.

"అక్కకి జ్వరం బాబూ! రెండు రోజుల్లో బాగయిపోతుందిలే! అప్పుడు మీరిద్దరు ఆడుకుందురుగాని, నువ్వుపోయి ఆడుకో నాయనా!" అని వాడిని ఆటకి పంపేసి మళ్ళా తన ఆలోచనల్లో మునిగిపోయింది.

"భగవంతుడు నన్నెందుకింత అసహాయగా చేశాడు? ఈ బిడ్డల్ని నేనొక్కర్తిని సాకగలనా! ప్రేమించి పెండ్లాడినందుకు ఫలితమిదేనా? ఇంట్లో వాళ్లందరిని ఎదిరించి పెళ్లాడినందుకు నాకు కలిగిన సుఖమిదేనా!" అంటూ తనలో తానే కుమలసాగింది. మనస్సంతా వ్యాకులంగా ఉంది. అరుణకు కన్నీరు తనకు తెలియకుండానే కండ్ల నుండి ఏకధాటిగా జారుతున్నా ఆ అమాయక అవి గుర్తించే స్థితిలో లేదు.

ఇంతలో ఆ ఇంటిముందు ఒక జట్కా ఆగింది. జట్కా రావటంగాని, అందులో నుండి మనిషి దిగటంగాని అన్య మనస్క అయిన అరుణకు

తెలియలేదు. ఆ వచ్చిన వ్యక్తి గబగబా వరండాలోకి వచ్చి కన్నీరు కారుస్తూ నిస్సహాయగా కూర్చున్న అరుణనుచూచి, గాభరాగా- "అరుణా! బేబికి ఎలా ఉంది?" అన్నది.

ఆమాటలతో అరుణ ఒక్కసారి ఉలిక్కిపడి "ఆ! వచ్చావా! రామం! నీ వొస్తావనే వెయ్యికళ్ళతో చూస్తున్నా. లోనికిపద. బేబీని చూద్దువుగాని" అంటూ లోనికి తీసికెళ్ళింది.

ఆ వచ్చిన వ్యక్తి డాక్టర్ రామలక్ష్మి. అరుణ, రామలక్ష్మి ఇంటర్మీడియేట్‌లో క్లాస్‌మేట్సు. క్లాస్‌మేట్సును ప్రాణస్నేహితులుగా మార్చింది ఆ రెండుసంవత్సరాల కాలం! అరుణకు రామలక్ష్మికన్న సన్నిహితు లెవరూ కనిపించక పోయేసరికి, ఆమెకే రమ్మని వ్రాసింది.

బేబీని చూచి ఇద్దరూ మళ్ళా బయటకు వచ్చి కూర్చున్నారు.

"ఏమిటి అరుణా! ఇంత మారిపోయావ్! కూతురు జబ్బుగా వుందనే! పిచ్చిదానా, ఫర్వాలేదులే! స్ట్రెప్టొమైజిన్ ఇస్తున్నారుగా మరేం బెంగపడకు. అన్నట్టు, మీవారేరీ? ఆఫీసు నుండి ఇంకా రాలేదా?" అంటుంటే,

"ఆఁ! అవునవును. ఇంకా రాలేదు. వస్తారు" అంటూ అరుణ తడబడుతూ జవాబిచ్చి, ఆ సంభాషణ వేరేవిధంగా మళ్ళిస్తే బాగుంటుందని "రామం! స్నానానికి నీళ్లుపెడతానురా. అలసిపోయావు. ప్రయాణబడలిక మరి!" అంటూ లేచి వంటింటివైపు వెళ్ళింది.

ఆ రాత్రి బేబీ ఏమీ గొడవచెయ్యకుండానే రామలక్ష్మి యిచ్చిన మందు తాగేసింది. బేబీ నిద్రపోయిం తర్వాత అరుణవచ్చి భోజనానికి లేవమంది.

"మీవారు రానీయవే! అంతవరకు ఉంటాలే!" అంది రామలక్ష్మి.

"ఆఁ! ఫర్వాలేదులే! మనం భోంచేద్దాం, రా" అంటూ తీసికెళ్ళింది.

అప్పటికే గోపి బుద్ధిగా కూర్చుని వాళ్ళ అమ్మకొరకు చూస్తున్నాడు.

"ఒరేయ్ గోపీ! ఈవిడెవరో తెలుసా! మీ రామం పిన్నిరా!" అంది అరుణ.

"పిన్ని పేరు 'రామం,' ఆఁ! అదేంటి? మన పక్కింటి అబ్బాయిని వాళ్ళ బామ్మగారు 'ఒరే రామం' అని పిలుస్తుంది. అయితే పిన్ని మొగాడా?" అంటూ చప్పట్లుకొట్టి నవ్వసాగాడు ఆ మాటలు వింటుంటే రామలక్ష్మికి నవ్వాగలేదు. అంత విషాదంలో ఉన్నా అరుణ ముఖం మీదకూడా నవ్వురాకుండా ఉండలేకపోయింది.

"తప్పురా! పిన్నిని అలాఅనొచ్చా!" అంటూ వడ్డన ప్రారంభించింది.

భోజనాలయిం తర్వాత పక్కలు ఎర్పుకు స్నేహితు లిద్దరూ కూర్చున్నారు.

"అరుణా! మీవారు వస్తారన్నావ్! ఇంకా రాలేదేఁ! ఊరెళ్ళారా, ఏం?" అంది రామలక్ష్మి. తన మనస్సులో ఎప్పటినుండో మెదలుతున్న అనుమానాన్ని నివృత్తి చేసుకుందామనే ఉద్దేశంతో.

"ఆ! అవును. చెప్పటం మర్చాను ఊరెళ్ళారు." అంది అరుణ కళ్ళనీళ్ళు అపుకుంటూ. కాని లైటు వెలుతురులో ఆ నీళ్ళు మిలమిలా మెరవటం గమనించింది రామలక్ష్మి

"అరుణా! ఏమిటో దాస్తున్నావ్! నీముఖం చూస్తుంటే ఎంతో విషాదం నీలో ఇముడ్చుకున్నట్లుగా కనిపిస్తోంది. అసలు సంగతేమిటి మీ ఉభయుల మధ్య కీచులాట లేమైనా వచ్చాయా?" అంటూ అరుణమీద చెయ్యి వేసి స్నేహపూర్వంగా నిమర సాగించె ఓదార్చే వాళ్ళెవరైనా ఉంటే దుఃఖం కట్టలు తెంచుకు వస్తుంది. అరుణ ఒక్కసారి బావురుమని, మళ్ళా పిల్లలు లేస్తారేమోనని ఎంతో కష్టంమీద శబ్దం పైకి రాకుండ నిగ్రహించుకుంది.

"ఏం చెప్పమంటావే, రామం! నా బ్రతుకిలా అవుతుందని నే నెప్పుడూ అనుకోలేదు. నాకు లోకంలో అందరూ ఉండికూడా, లేనిదానిలా ఉన్నాను" అంది అరుణ.

"సంగతేమిటో చెప్పు. నాచేతనయినంత సాయం చేస్తా" నంది రామలక్ష్మి.

"ఒకరి సహాయంతో నా బ్రతుకు చక్కబడుతుందా! ప్చ్! అసలు సంగతి చెప్పాలంటే, నీవు నన్ను విడచి విశాఖపట్నం వెళ్ళిందగ్గ:

నుండి కథంతా చెప్పకు రావాలి'' అంటూ నిట్టూర్చింది, అరుణ.

''ఫర్వాలేదు. నీ హృదయం నా ముందు విప్పితే దానివల్ల నీ దుఃఖం కాస్త ఉపశమిస్తుంది,'' అని మిత్రురాలనగా అరుణ నెమ్మదిగా ప్రారంభించింది.

* * *

''నీవు డాక్టర్ కోర్సు చదవటానికని విశాఖపట్నం వెళ్ళిపోయావు. నేను రాజమండ్రిలోనే బి. ఏ.,లో చేరిన సంగతి నీకు తెలిసిందే మొదట్లో కాలేజీలో నీవు లేకపోవటంవల్ల ఏదో వెల్తిగా ఉండేది. కాని క్రమేణా కొత్త పరిచయాలు కలిగి రోజులు హాయిగా గడిచిపోసాగాయి. మూన్నెల్ల తర్వాత దసరా శెలవులిచ్చారు. నేను ఇంటికి వచ్చాను.

ఆ రాత్రి భోజనాలయిం తర్వాత, అంతా ఆరుబయట కూర్చున్నాం.

''ఏమమ్మా! బి. ఏ చదువెలాగుంది?'' అని అడిగారు నాన్న

''చదువు బాగానేఉంది నాన్నా. ఇంగ్లీషు డ్రామా చెప్పడానికి ఒక క్రొత్త లెక్చరర్‌గారు వచ్చారు. నిజంగా ఎంత బాగా చెప్తారనుకున్నావ్!'' అన్నాను.

''ఆయన పేరెవరమ్మా?''

''రామశాస్త్రిగారట. అటు విశాఖజిల్లానుంచి వచ్చారు.''

''ఆ పేరుతో నా స్నేహితు డొకాయన ఉన్నాడు. బహుశః వాడే అయిఉంటాడులే! చాల మంచివాడు. భార్యకూడ చాల ఉత్తమురాలు'' అన్నారు నాన్న, పూర్వ స్మృతులను జ్ఞాపకం చేసుకుంటూ.

మళ్లీ నాన్నగారే అన్నారు—

''హాస్టల్ విశేషాలేంటమ్మా! నీతో ఇంటర్మీడియేట్ చదివిన వాళ్లెవరైనా ఉన్నారా?''

''హాస్టలంటే జ్ఞాపకం వచ్చింది నాన్నా! ఈ ఏడు మా వార్డెన్ మారింది. ఇక మా భోజనం మరీ అధ్వాన్నం అయింది. ఒక్క మెతుకు దిగటం లేదు,'' అన్నాను నేను. అమ్మకూ, నాన్నకూ ఒక్కర్తినే సంతానం కావటంచేత నేనంటే ఎంత గారాబంగాచూస్తారో నీకు తెలునుగా! నేను చెప్పిన ఆ రెండు ముక్కలు వినీ వినగానే, ''అయ్యో! అమ్మాయి ఆ తిండి తింటే ఎలా చదవగలదండీ! నా బిడ్డ చిక్కి శల్యమైపోదూ! మీరు మరో ఏర్పాటేదైనా చెయ్యించండి'' అంది మాఅమ్మ నాన్నగారితో.

''అలాగే, చూద్దాం!'' అన్నారు నాన్న.

ఆ మర్నాడు దసరా ''గ్రీటింగ్‌కార్డు'' ఒకటి నాకు వచ్చింది 'ఎవరా?' అని చూస్తే ఆ పేరు నా కెంతకీ అర్థమవలేదు. ఆడపిల్లల వ్రాతలా లేదు ఒక అక్షరంలో మరొక అక్షరం. వాటిలో 'కె' అనే అక్షరాన్ని మాత్రం గుర్తించగల్గాను. పోస్టు ముద్ర చూచాను. రాజమండ్రి అని ఉంది. ఎవరో కొంటె కొక్కిరాయి పంపి ఉంటాడని అనుకున్నా.

శెలవు లయిం తర్వాత మా నాన్న నాతో కూడా రాజమండ్రి వచ్చారు. నేను మామూలుగా హాస్టల్‌కి వెళ్ళాను. ఆ రోజంతా తిరిగి, సాయింత్రం నాన్న నా దగ్గరకు వచ్చారు.

''అమ్మా! మీ రామశాస్త్రిగారింటికి వెళ్ళాను. వాడు నా చిన్ననాటి స్నేహితుడే, తల్లీ! వారి ఇంట్లో నీ బసకూడ ఏర్పాటుచేశాను''అన్నారు.

''అదేవిటి నాన్నా! లెక్చరర్ గారింట్లోనా! నాకు భయం వేస్తుంది బాబూ''' అన్నాను.

''ఫర్వాలేదమ్మా. ఆవిడ చాల మంచిది. నిన్ను త్వరగా వెంటపెట్టుకు రమ్మంది'' అని నాకు ఎంతో నచ్చచెప్పింతర్వాత నేను హాస్టలు నుండి కదిలాను.

నిజంగా ఆ దంపతులు చాల దయకలవారు నన్నెంతో చక్కగా చూచేవారు. ఒక రోజు మామూలుగా కాజీలేకి వెళ్తున్నా. ఇంకా కాలేజీ ఓ ఫర్లాంగు ఉండగా, ఎవరో వెనక నుండి ''అరుణాదేవిగారూ!'' అని నెమ్మదిగా పిల్చినట్లనిపించింది. కాని నేను వెనక్కు తిరగ లేదు. మరల అదే పిలుపు! చూడకూడదనుకుంటూనే వెనక్కు తిరిగి చూచాను. చూడ్డానికి చక్కగా ఉన్నాడు. బక్కపలచగా ఎర్రగా ఉన్నాడు. అన్నిటికి మించి నొక్కుల జుట్టు.

''ఈ అబ్బాయి ఎవరా, నన్ను పేరు పెట్టి పిలవటమే కాకుండా, వెనుక 'దేవి' అని కూడా తగిలించాడు'' అని అనుకుంటుంటే—

'నన్ను గుర్తించలేదండీ? నేను కూడా బి. ఏ., చదువుతున్నాను. నా పేరు కృష్ణ మూర్తి లెండి! మీ ఎకనామిక్సు నోట్సు ఒకసారి స్తారా? మళ్ళీ రిటర్న్ చేస్తాను'' అన్నాడు.

ఈ నోట్సులు అడిగే అబ్బాయిల సంగతి మనకు తెలియదు గనుకనా!....

''ఐయామ్ వెరీసారీ! మీ ఫ్రెండ్స్‌నే ఎవరి నైనా అడగండి'' అంటూ రయిన కాలేజీ గ్రౌండ్సులో పడ్డా

తరువాత, క్లాసులో ఎప్పుడైనా తలెత్తి చూద్దునుకదా-కళ్లప్పగించి నా వైపు చూస్తుండే వాడు. 'ఏమిటి, ఈ అబ్బాయి సంగతి!' అని విసుక్కునేదాన్ని, కాని ఒక్కొక్కసారి అప్రయత్నంగా నా కళ్ళు కూడా ఆ అబ్బాయి వైపే మరలుతూండేవి.

ఆ రోజు శనివారం.

రామశాస్త్రిగారు, ఆయన భార్య ఆ ఊర్లోనే ఎవరింట్లోనో పెండ్లిఅవుతుంటే వెళ్ళారు నన్ను కూడా రమ్మని చాల బలవంతం చేశారు. కాని నేనెలాగో తప్పించుకున్నాను.

నేను తలంటుకొని భోంచేసి, హాల్లో కుర్చీలో కూర్చుని ఏదో పత్రిక తిరగవేస్తు న్నాను. ఇంతలో ఎవరో బయటనుండి కేక వేశారు, ''శాస్త్రిగారూ!'' అంటూ.

''ఇంట్లో లేరండీ!'' లోపలినుండే జవాబిచ్చాను.

''ఎక్కడికి వెళ్ళారండీ?'' అంటూ, అతను హాల్లోకి వచ్చాడు. ఆ వచ్చింది కృష్ణమూర్తి. అదే మరెవరో అయిఉంటే నాజీవితం ఇంకో పంథాలో నడిచి ఉండేది.

''పెండ్లికి వెళ్ళారండీ! సాయంత్రానికిగాని రారు,'' అంటూ వెళ్ళిపోతాడుగదా అని నిరీక్షిస్తూ నిలబడ్డాను. కాని ఆ మహానుభావుడు వెళ్ళలేదు, సరికదా అక్కడున్న ఓ కుర్చీలో కూర్చుని, ''కాస్త మంచినీళ్ళిప్పిస్తారూ!'' అన్నాడు.

నాకెందుకో గుండెలో దడ బయలుదేరింది. ఒంటరిగా ఉన్నాను. బహుశః ఇంట్లోవాళ్ళు లేరని తెలుసుకు ఇలావచ్చి ఉంటాడనే అనుమానం రాగానే, నాకు ముచ్చెమటలు పోసాయి.

మంచినీళ్ళు తెచ్చి అక్కడే ఉన్న బల్లమీద పెట్టి లోనికి వెళ్లబోతూంటే, ''అరుణాదేవీ! మీతో కాస్త మాట్లాడాలి, కూర్చోండి!'' అన్నాడు.

అప్పటి నా స్థితి వర్ణించలేను.

అలాగే రాయిలా నిలబడ్డాను. ఆ చెప్పే దేవిటో ఊహించలేనంత చిన్నపిల్లని కానుగా! కృష్ణమూర్తి కూడ అలాంటి సున్నితమైన విషయం గురించి ఎలా ప్రస్తావించాలా అన్నట్లు తికమకలు పడుతున్నట్లు కనబడ్డాడు

''అరుణా!'' .......

ఆ పిలుపు నాకు క్రొత్తగా అనిపించి, గబుక్కున ఒకసారి తలెత్తి మళ్లీ దించేసుకున్నాను.

''మిమ్మల్ని చూచిందగ్గరనుండి నేనొక క్రొత్త వ్యక్తిగా మారిపోయాను. మీతో ఎన్నో సార్లు మాట్లాడాలని తలంచానుగాని, మీరు నాకలాంటి అవకాశం ఇవ్వలేదు. ఇలావచ్చి మిమ్మల్ని డైరెక్టుగా అడగటం సమంజసం కాకపోయినా, ముసుగులో గుద్దులాట భరించ లేక ఇలా వచ్చాను. అది — మనవే అనండి, కోరికే అనండి — మీరు మన్నిస్తేనేగాని నేనీరోజు ఇక్కడినుంచి కదలను.''

నేనేమీ మాట్లాడలేక పోయాను. జీవితంలో క్లిష్టమైన సమస్యల్లో జీవిత భాగస్వామిని ఎన్నుకోవటం ఒకటికదా! అలాంటిది, ఇలా నిలబెట్టి అడిగివేస్తుంటే నేనేం చెయ్యగలను. ఆ విషయంలో ఎంత ఆలోచించాలి? నలుగుర్ని పిలిచి అతణ్ణి బయటకు గెంటించ లేక పోయావా, అని అంటావేమో! అలా చెయ్య లేక పోయాను అతనికి నాహృదయంలో నాకు తెలియకుండానే ఒక సున్నితమైన స్థానం ఏర్పడింది కాబోలు!

''మీరు అలా ముభావంగా ఉంటే కాదండీ. ఇప్పటి నా ప్రవర్తన మోటుగా ఉంటే క్షమించండి. కాని, ఏదో ఒకటి తేలాలనే పట్టుదలతో వచ్చాను. చెప్పండి!'' అన్నాడు.

నెమ్మదిగా నేనిలా అన్నాను.

''మీరలా నిక్కచ్చిగా అడిగే విషయమంటారా, ఇది! నేను తలిదండ్రులచాటు దానిని. వారి అనుమతి మీదే ఏదైనా జరగాలి. అలా జరగాలనే నా అభీష్టం కూడా! మిమ్మల్ని

కష్టపెట్టినందుకు క్షమించండి ఇంక వెళ్లండి.'' అన్నాను

''సరే! వెళ్తాను. కాని ఒక్క మాట నేను ప్రాణాలు త్యజిస్తే ఈ ప్రపంచానికి తగ్గేదేమి లేదు లోకంలో నాకు నా అనే వాళ్లెవరూ లేక పోవటంచేత నేను చచ్చిపోయినా నా గురించి ఏడ్చేవాళ్లేనా ఉండరు.'' ఎందుకో కాస్సే పొగాడు అటు చూద్దును కదా, కళ్లు ఎఱ్ఱగా ఉన్నాయి. కళ్లల్లో నీళ్లు స్పష్టంగా కనిపించాయి నాకు. 'ఎంత సున్నితమైన హృదయం' అనుకున్నాను మనస్సులో.

''నేను రేపటినుండి మీకసలు కనిపించను. గోదావరిలో ఏదైనా శవం తేలిందని మీ చెవిలో పడితే నాకొరకు రెండు కన్నీళ్లు పిడుస్తారు కదూ!'' అంటూ లేచి వెళ్ళిపోతున్నాడు

అతని మాటలు చూస్తే అన్నంత పనీ చేసే టట్టున్నాడు. నాకు తెలియకుండానే 'ఏమండీ' అన్న మాట ఆదుర్దాగా వచ్చింది, కృష్ణమూర్తి వెనక్కి తిరిగాడు

''ఏమండీ! దయచేసి అలాంటి ఉద్దేశాలు మీ మనస్సులో పెట్టుకోకండి మీకు మంచి భవిష్యత్ ఉంది ప్రపంచం సువిశాలమైంది. నాకన్న అందమైన వాళ్ళు, మీ మనస్సుకు నచ్చేవాళ్ళు ఎంతోమంది మీకు తటస్థిస్తారు''. ఇంకా చెబుదామనుకున్నది చెప్పనీయకుండా మధ్యలోనే,''నాకలాంటి ఆశలు కల్పించ ప్రయత్నించకండి. నేను చెప్పింది అక్షరాలా చేసితీరతాను'' అన్నాడు దృఢ నిశ్చయంతో.

''దయచేసి అంత పని మాత్రం చెయ్యకండి'' అన్నాను, ఇంకేమనాలో తెలియక.

''బ్రతికి సాధించేదేముంది?'' అన్నాడు నిస్పృహతో.

''వద్దండీ! మిమ్మల్ని బ్రతమాలుకుంటాను'' అన్నాను.

''అయితే నా కోరిక మన్నించినట్టే కదూ!'' అని నా కళ్ళలోకి ఆశగా చూచాడు.

''ఆఁ!''అన్నాను. ఎన్ని సమస్యలు ఎదురైనా ధైర్యంగా ఉండవలసిన పరిస్థితి ఆ క్షణం నుండి నాకు ఆరంభమయింది.

కృష్ణమూర్తి సంతోషంతో ఏమీ చెప్పలేక, ''చాల కృతజ్ఞుణ్ణి అరుణా!'' అంటూ వెళ్ళిపోయాడు.

ఆ దసరా శెలవుల్లో శుభాకాంక్షలు పంపింది కృష్ణమూర్తేనని నేను వేరుగా చెప్పనవసరం ఉండదు

ఆ రోజు మొదలు మేము అప్పుడప్పుడు కలుసుకుంటూ ఉండేవాళ్ళం. కృష్ణమూర్తికి ఎవరూ లేరు ఆస్థిపాస్తులూ లేవు స్కాలర్‌షిప్ మీద బి.ఏ చదువుతున్నాడు ఆ నాటి నుండి నాకు కృష్ణమూర్తంటే ఒకవిధమైన గౌరవం ఏర్పడింది. స్త్రీ ఒకసారి తనను తాను ఎవరికైనా అర్పించుకుంటే దాన్ని నిలబెట్టుకుందుకు తన ప్రాణాలనైనా అర్పిస్తుంది ఆ రెండు సంవత్సరాలలోను మా ఇద్దరి మధ్య ప్రేమాంకురం చిగిర్చి మొగ్గతొడిగింది. ఒకరోజు మేమిద్దరం పార్కులో కలుసుకున్నాం.

''కృష్ణా! మన పరీక్షలు దగ్గరకు వస్తున్నాయి అవి కాస్త అయిపోతే ఎవరిదారిన వాళ్లం వెళ్ళిపోవాలి తర్వాత మనం ఏం చెయ్యాలి?'' అన్నాను

కృష్ణమూర్తి నా కళ్లలోకి చూస్తూ ''అరుణా! నిన్ను విడచి నేను ఒక్క క్షణం ఉండలేను. నా చిన్నప్పుడే 'నా' అన్నవాళ్లంతా నన్ను దిక్కులేనివాణ్ణి చేసిపోయారు. అప్పటినుండి నాకు తల్లిప్రేమగాని, తోబుట్టువుల వాత్సల్యంగాని ఎలాంటిదో ఎరుగను. ఈ నాటికి నన్ను ప్రేమగా దగ్గరకు చేర్చుకుని లాలించే ఒక దేవతామూర్తి నాకు సాక్షాత్కరించింది. ఆవిడను వదలి నేను బ్రతగ్గలనా!'' అన్నాడు.

''నా హృదయం నీకు తెలియదా కృష్ణా! కాని ఏంచెయ్యగలం?....అన్నట్టు, ఒక సంగతి. మనం శెలవులకు ఇండ్లకు వెళ్ళింతర్వాత ఎవరినైనా పెద్దవాళ్లను వెంటపెట్టుకొని మా ఇంటికి వచ్చి పెద్దల ముఖతా మా నాన్నగారిని అడిగి చూడండి. తర్వాత ఏది ఎలా అవనున్నదో, అది అవుతుంది'' అన్నాను.

తర్వాత మేమిద్దరం ఇళ్లకు వెళ్లడానికి లేచాం.

(ముగింపు వచ్చే సంచికలో)